ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 కర్నూలు జిల్లా వార్తలు
సోమవారం 3 జూన్ 2024

పటిష్ట భద్రత



(కర్నూలు-ఆంధ్రజ్యోతి)/కర్నూలు జూన్ 2:

అభ్యర్థుల భవిష్యత్తు ఏంటో తేలిపోయే రోజు వచ్చేసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓటరన్న తీర్పు వెల్లడయ్యే సమయం ఆసన్నమైంది. ఓట్ల లెక్కింపునకు ఇక కొన్ని గంటలే మిగిలి ఉంది. కోటాను కోట్ల రూపాయలు నీళ్ల ప్రాయంగా ఖర్చు చేసిన అభ్యర్థుల భవిష్యత్తు మంగళవారంతో తేలిపోనుంది. ఈ కీలకమైన రోజు కోసం అభ్యర్థులు, ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించడంతోపాటు ఆ తరువాత పల్లెలు, పట్నాల్లో శాంతిభద్రతలు కాపాడే దిశగా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటికే గ్రామాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులు ఎవరో గుర్తించి వారి కదలికలపై నిఘా పెట్టారు. ఓట్ల లెక్కింపు తరువాత గొడవల జరిగేందుకు అవకాశం ఉన్న అత్యంత సమస్యాత్మకమైన 188 గ్రామాలను గుర్తించారు. ఓట్ల లెక్కింపు జరిగే రాయలసీమ యూనివర్సిటీ పరిసరాల్లో సెక్షన్-144 అమలు చేస్తున్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలకు అనుమతులు నిరాకరించారు. జిల్లా అంతటా 30-పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. అల్లర్లు సృష్టించినా.. చట్టాలను అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జి. కృష్ణకాంత్ హెచ్చరిస్తున్నారు. అదే క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు సైతం గొడవలకు అవకాశం ఇవ్వకుండా సంయమనం పాటించాలని, ఈ మేరకు తమ అనుచరులు, సహచరులకు సూచించాలని కోరుతున్నారు. భద్రత ఏర్పాట్ల గురించి ఆదివారం ఆయన పలు విషయాలను ఆంధ్రజ్యోతికి వివరించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

ఓట్ల లెక్కింపు తరువాత జిల్లాలో ఘర్షణలు జరిగేందుకు అవకాశం ఉన్న 188 గ్రామాలను గుర్తించాం. అందులో ఫ్యాక్షన్ నేపథ్యం కలిగిన గ్రామాలు కూడా ఉన్నాయి. ఆ గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచడంతోపాటు గొడవలు, అల్లర్లు సృష్టించేందుకు అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి వారి కదలికలపై నిఘా పెట్టాం. ప్రతి గ్రామంలోనూ పోలీస్ పికెట్ ఏర్పాటు చేశాం. సీఆర్పీఎఫ్, ఏపీఎస్పీ బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నాయి. నియోజకవర్గ కేంద్రాలు, ప్రతి మండల కేంద్రాల్లో పోలీస్ బలగాలు అందుబాటులో ఉంచాం. ఎక్కడ ఘర్షణలు జరిగినా తక్షణం అక్కడికి చేరుకునేలా ఏర్పాట్లు చేశాం.

వర్సిటీ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు

రాయలసీమ యూనివర్సిటీలో మూడు బ్లాకులలో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేశారు. కర్నూలు పార్లమెంట్ స్థానం, కర్నూలు, కోడుమూరు (ఎస్సీ), ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పాణ్యం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు అక్కడే ఉంటుంది. మూడంచెల భద్రతోపాటు యూనివర్సిటీ బయట ఎలాంటి గొడవలు జరగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాం. వర్సిటీ పరిసరాల్లో సెక్షన్-144 అమలులో ఉంటుంది. ఏపీఎస్పీ రెండు బెటాలియన్లను మనకు ఇచ్చారు. గ్రామాల్లో మాక్ డ్రిల్ కూడా నిర్వహించాం. ఓట్ల లెక్కింపు దృష్ట్యా కర్నూలు నగరంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుంది. రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, ఓట్ల లెక్కింపు ఏజెంట్లు కూడా పోలీసులకు పూర్తిగా సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 91 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, పోలీసు రూట్ మొబైల్ పార్టీల నిఘా ఉంటుంది.



ర్యాలీలు, సభలకు అనుమతులు లేవు

జిల్లాలో శాంత భద్రతలు దృష్ట్యా ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించడానికి ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. బాణాసంచా కూడా కాల్చరాదు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీ నాయకులు గుర్తించాల్సిన అవసరం ఉంది. అదే క్రమంలో జిల్లా అంతటా 144 సెక్షన్, 30-పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదు. గుంపులు గుంపులుగా ఉండరాదు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది.



భారీ బందోబస్తు

రాయలసీమ యూనివర్సిటీలో కర్నూలు లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు ఉంటుంది. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 28 ఎస్‌ఐలు, 120 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 120 మంది మంది కానిస్టేబుళ్లు, 40 మంది మహిళా కానిస్టేబుళ్లు, 196 మంది హోంగార్డులతోపాటు 2 స్పెషల్ పార్టీలు, కేరళ స్పెషల్ ఆర్మ్డ్ పోలీసుల బలగాలు ఓట్ల లెక్కింపు బందోబస్తు విధులు నిర్వర్తిస్తాయి. డ్రోన్ కెమెరాలు, మెన్ కెమెరాలతో ప్రతి క్షణం నిఘా ఉంటుంది. ఏ చిన్న సంఘటన జరిగినా తక్షణమే సిబ్బంది స్పందిస్తారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వంద మీటర్ల దూరంలోనే ప్రజలు ఉండాలి. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. అలాగే. జిల్లా వ్యాప్తంగా ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 51 మంది సీఐలు, ముగ్గురు ఆర్‌ఐలు, 73 మంది ఎస్‌ఐలు, 9 మంది ఆర్‌ఎస్‌ఐలు, 1,560 మంది పోలీస్ సిబ్బంది, ఎస్‌ఏఆర్ 24 మంది, కేరళ సీఏపీఎఫ్ ఒక కంపెనీ, బీఎస్ఎఫ్ ఒక కంపెనీతోపాటు హోంగార్డులు సహా కేంద్ర బలగాలు ఎస్‌పీఎఫ్ 20 బందోబస్తు విధుల్లో ఉన్నాయి.

- రేపు ఓట్ల లెక్కింపు
- భారీ బందోబస్తు ఏర్పాటు
- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- అత్యంత సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా
- 48 షాడో పార్టీలు, 65 రాత్రి గస్తీ బృందాలు
- 7,094 మందిపై బైండోవర్ కేసులు నమోదు
- 188 గ్రామాల్లో పోలీస్ పికెట్లు
- విజయోత్సవ ర్యాలీలు నిషేధం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జి. కృష్ణకాంత్

గృహ నిర్బంధం

ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాం. 188 సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్స్ పెట్టాం. ఆయా రాజకీయ, ముఖ్య నాయకుల కదలికలపై నిఘా ఉంచేందుకు షాడో పార్టీలు పెట్టాం. ఎవరైనా సమస్యలు సృష్టిస్తే గృహ నిర్బంధం చేసేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం.

పెన్ను, పేపరు మాత్రమే తెచ్చుకోవాలి

అభ్యర్థులు నియమించిన కౌంటింగ్ ఏజెంట్లు తమతోపాటు ఓట్ల లెక్కింపు కేంద్రాలకు పెన్ను, పేపరు మాత్రమే తెచ్చుకోవడానికి అనుమతిస్తాం. సెల్‌ఫోన్లు, నీళ్ల బాటిళ్లు, ల్యాప్‌ట్యాప్‌లు.. వంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించం. బీపీ, షుగర్ వంటి జబ్బులతో బాధపడే వాళ్లు ఏజెంట్లుగా ఉంటే వారికి అవసరమైన అత్యవసర మెడిసిన్‌ను అనుమతిస్తాం. మీడియా సెంటర్ వరకు మాత్రమే మీడియా ప్రతినిధులకు అనుమతి ఉంటుంది.

31 చెక్‌పోస్టులు ఏర్పాటు

కర్నూలు నగర శివారులో 8 సహా జిల్లాలో 31 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 1775 గ్రామ సభలు నిర్వహించాం. 7,094 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశాం. 39 ముఖ్యమైన జంక్షన్లు గుర్తించి 48 షాడో పార్టీలు, 65 రాత్రి గస్తీ బృందాలు నియమించాం. 46 మంది ప్రొటెన్షియల్ ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం.

పోలీసు సూచనలు

- శాంతియుత వాతావరణం కోసం రాజకీయ పార్టీలు, ప్రజలు, మీడియాకు సహకరించాలి.
- బాణ సంచా నిల్వ ఉంచడం, క్రయవిక్రయాలు చేయడం, కాల్చడం చేయరాదు.
- అనధికారికంగా మద్యం విక్రయాలు చేసినా.. హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు
- నలుగురికంటే ఎక్కువగా గుమికూడరాదు.
- కౌంటింగ్ సమయంలో అవాంతరాలు సృష్టిస్తే చర్యలు ఉంటాయి.
- అభ్యర్థులు, వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించినా, డప్పులు, బాణాసంచా పేల్చినా చర్యలు తప్పవు
- ఓటమి చెందిన వారి పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడినా, హేళన చేసినా, రెచ్చగొట్టే చర్యలు చేసినా కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది
- యువత అల్లర్లు, గొడవలకు పాల్పడి కేసుల్లో ఇరుకుని భవిష్యత్తు పాడు చేసుకోరాదు.
- బాణాసంచా అమ్మకాలు చేయకుండా లైసెన్సుదారులు, గోదాముల యజమానులకు నోటీసులు జారీ చేశాం.

ఎగ్జిట్ పోల్స్ మనకే అనుకూలం

- కౌంటింగ్ రోజు గలాటాలొద్దు.. భేషజాలకు పోవద్దు
- ఏజెంట్లకు బ్రీతింగ్ పరీక్షలు ఉంటాయి.. జాగ్రత్త
- అధికారం శాశ్వతం కాదు...జగన్ దుర్మార్గమైన ప్రయోగాలు చేశారు
- మద్యం, ఇసుక, మైనింగ్ దోపిడీపై కసితో ఓటింగ్
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూన్ 2: జాతీయ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు సైతం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అనుకూలంగా వచ్చాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియ అనంతరం భేషజాలకు పోకుండా ఒక మెట్టు దిగి కవ్వింపు చర్యలకు దూరంగా ఉండాలని అన్నారు. కౌంటింగ్ హాలులోకి వెళ్లే ఏజెంట్లు సైతం జాగ్రత్తగా ఉండాలని, లోపలకి వెళ్లే సమయంలో బ్రీతింగ్ పరీక్షలు చేస్తారని, ఎవరు మద్యం సేవించి కౌంటింగ్‌కు వెళ్ల వద్దని సూచించారు. లోక్ సభ, శాసన సభ ఓటింగ్ ప్రక్రియలో విజయం సిద్ధిస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించబోతున్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి సాగించిన ఎన్నో అప్రజాస్వామిక పద్ధతులతో ప్రతి పక్ష తెలుగుదేశం పార్టీ నాయకులనే కాకుండా సామాన్య ప్రజానీకాన్ని సైతం వదలలేదని, అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి కసితీరా ఓటు వేశారని తెలిపారు. వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, రైతులు, పెన్షన్‌దారులు అందరూ వైసీపీ పాలనపై విసుగు చెందారని అన్నారు. మద్యం, ఇసుక, మైనింగ్ మాఫియాలతో ఖజానాను జగన్ దోచుకున్నారని ధ్వజమెత్తారు. కల్తీ మద్యం విక్రయాలతో ఆదాయా వనరులను పెంచి పోగుచేసుకున్న దుర్మార్గుడని రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఎలాంటి పాపం ఎరుగని చంద్రబాబును 53 రోజులు జైలు పాలు చేసిన జగన్‌కు రాబోయే రోజుల్లో జైలు తప్పదని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ ఇక డబుల్ ఇంజన్ సర్కార్ రానున్నందున గత వైసీపీ ప్రభుత్వం విస్మరించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి జరుగుతుందన్నారు. అర్థాంతరంగా ఆగిపోయిన పోలవరం పూర్తి చేస్తామని, సూపర్ సిక్స్ పథకాల అమలుకు కేంద్ర సహకారాన్ని తీసుకుంటామని అన్నారు. జాబ్ క్యాలెండర్‌తో యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అంతక ముందు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆకేపోగు ప్రభాకర్, ఎస్. ముంతాజ్, జె. తిరుపాల్ బాబు, సోమిశెట్టి నవీన్, ఎల్లప్ప, డీ. జేమ్స్, వి. హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

లెక్కింపును విజయవంతం చేయండి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్
- అన్ని ఏర్పాట్లతో సిద్ధం
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 2: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజనను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ హాలులోకి సెల్‌ఫోన్లు అనుమతించవద్దని, రౌండ్ల వారిగా కచ్చితమైన ఫలితాలను నిర్దేశించిన ప్రొఫార్మాలలో ఎన్నికల కమిషన్‌కు నివేదికలను ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాలు నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చేందుకు అత్యవసర ద్వారం ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ఆవరణలో మీడియాకు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అక్కడి వరకు మొబైల్ ఫోన్లకు అనుమతి ఉందని, కౌంటింగ్ హాలులోకి మాత్రం మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కలెక్టర్ డా.జి. సృజన వివరిస్తూ కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో కౌంటింగ్ జరుగుతున్న 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ అసిస్టెంట్స్, సూపర్‌వైజర్స్‌కు రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చామన్నారు. మైక్రో అబ్జర్వర్స్‌కు సోమవారం కూడా శిక్షణ ఇచ్చామని వివరించారు. ఆదివారం ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందిని నియోజకవర్గాలకు కేటాయించామని చెప్పారు. ఈవీఎం కౌంటింగ్ (7 నియోజకవర్గాలు) పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సుమారు మధ్యాహ్నం 3.30 గంటలకు పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగా సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

వైద్య బృందాన్ని ఏర్పాటు చేయండి

ప్రతి బ్లాకులో ఎమర్జెన్సీ వైద్య బృందాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన ఆదేశించారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్, ఇంజనీరింగ్ బ్లాక్, కౌంటింగ్ రూమ్‌ను పరిశీలించారు. ప్రతి ఫ్లోర్‌లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి ఎమర్జెన్సీ ఎక్విప్ట్, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్‌బీ ఎస్‌ఈని ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బందిని నియమించాలని, ఎలక్ట్రికల్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగబాబు, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, సమాచార పౌర సంబంధాల అధికారి జయమ్మ పాల్గొన్నారు.

సమాజహితంగా వ్యక్తిత్వం ఉండాలి

- ఏపీఎంసీ అబ్జర్వర్ డా. రామసుబ్బారెడ్డి
- ముగిసిన సౌత్ జోన్ మానసిక వైద్యుల సదస్సు



ముగింపు సదస్సులో పాల్గొన్న మానసిక వైద్యులు

కర్నూలు(హస్పిటల్), జూన్ 2: రాజకీయ నేతల వ్యక్తిత్వం.. సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని ఏపీఎంసీ అబ్జర్వర్ ప్రముఖ మానసిక వైద్యుడు డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని మౌర్య ఇన్ హోటల్‌లో దక్షిణ భారతదేశ మానసిక వైద్యుల సదస్సు ముగిసింది. దాదాపు 357 మంది కర్ణాటక, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి వైద్యులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఏపీ ఎంసీ అబ్జర్వర్ డా. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాజకీయాల్లో మానసిక ఒత్తిళ్లు పెరిగిపోయాయని, దేశంలో కొందరు రాజకీయ నేతలు ఒత్తిళ్లు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓడిపోతే నిరాశకు గురవుతున్నారని అన్నారు. రాజకీయాలు, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని, గెలుపు, ఓటములు సాధారణమేనని సత్యాన్ని నేతలు గ్రహించాలన్నారు. అనంతరం ఆర్గనైజింగ్ చైర్మన్ డా.బి. రమేష్‌బాబు మాట్లాడుతూ మానసిక రుగ్మతలు, శారీరక సమస్యలు కలిసిపోవడం వల్ల సైకో సోమాటిక్ వస్తుందని, ఈ వ్యాధిని గుర్తించి చికిత్స చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కే. నాగిరెడ్డి, సౌత్ ఇండియా అధ్యక్షుడు డా. అభయ మట్కర్, సెక్రటరీ డా. లోకేశ్వరరెడ్డి, డా. అరుణ్ కుమార్, డా.పీఎస్ మూర్తి, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ డా.హరిప్రసాద్, డా. సుహృత్ రెడ్డి, సైంటిఫిక్ కన్వీనర్ డా.శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతన్నకు చల్లని కబురు

- వేగంగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు
- నేడో, రేపో రాయలసీమను తాకే అవకాశం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 2: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో రైతన్నలకు చల్లని కబురు మోసుకొచ్చాయి. ఖరీఫ్ పంటల సాగుకు కీలకమైన నైరుతి రుతుపవనాలు ఇప్పటికే దేశంలోని కేరళలో ప్రవేశించి, భారీ వర్షాలు కురుస్తుండగా, రేపు లేదా ఎల్లుండి మన రాష్ట్రంలోని రాయలసీమలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర వర్షాభావ పరిస్థితులతో, భూగర్భ జలాలు అడుగంటి, దిక్కుతోచని పరిస్థితుల్లో వున్న రైతులు, వివిధ వర్గాల ప్రజలకు, అనుకున్న సమయంలోనే నైరుతి రుతుపవనాలు మన దరికి చేరడం సంతోషాన్ని కలిగిస్తోంది. గత ఏడాది నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. దీంతో సంవత్సర కాలంగా సరైన వర్షాలు లేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. అయితే ఈఏడాది నైరుతి రుతుపవనాల కారణంగా జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. ఏపీలో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ రుతుపవనాల విస్తరణకు ఇవేవి అడ్డుకావని వాతావరణ శాఖ ప్రకటించింది. రేపో ఎల్లుండో రాయలసీమలోకి ప్రవేశించే అవకాశం ఉండటంతో ముందుగా చిరు జల్లులు, ఓ మోస్తరు వర్షాలు ప్రారంభమై నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లాలో ఎండల తీవ్రత, ఉక్కపోత నుంచి కూడా ప్రజలకు ఉపశమనం లభించనుంది. అనుకున్న సమయానికి వర్షాలు కురిస్తే జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు పూర్తి స్థాయిలో జరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నంద్యాల జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 3లక్షల హెక్టార్లకు పైబడి ఉంటుందని అధికారుల అంచనా. ఖరీఫ్‌లో రైతులు అధికంగా సాగు చేసే పంటలు మొక్కజొన్న, జొన్న, ఆముదం, ఉల్లి, మిరప, పత్తి, వరి తదితర పంటలను సాగు చేస్తారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే జూన్-15 తర్వాత రైతన్నలు పెద్ద ఎత్తున పంటల సాగుకు సమాయత్తం అవుతారు. అయితే అన్నదాతల చేయూత కోసం ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

టెన్షన్.. టెన్షన్..!

- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఓటర్లు ఇచ్చిన తీర్పు ఎలా ఉంటుందో..?
- ఎగ్జిట్ పోల్స్ వచ్చినా వీడని ఉత్కంఠ
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న బెట్టింగ్‌రాయుళ్లు



కర్నూలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల సుదీర్ఘ ప్రక్రియకు మంగళవారంతో తెర పడనుంది. రాష్ట్రంలో మే 13న ఓటర్లు తీర్పు ఇచ్చారు. ఈవీఎం యంత్రాల్లో అభ్యర్థులు భవితవ్యం నిక్షిప్తమై ఉంది. ప్రజల తీర్పు ఎలా ఉంటుందోనన్న ఆందోళన అభ్యర్థుల్లో మరింత ఎక్కువైంది. పోలింగ్ తరువాత కుటుంబ సభ్యులతో తీర్థయాత్రలకు వెళ్లిన వారు కొందరైతే.. విహార యాత్రలకు వెళ్లిన వారు కొందరు. మరికొందరు తమ వ్యాపార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఓట్ల లెక్కింపునకు మరికొన్ని గంటలే సమయం ఉండడంతో అభ్యర్థులు ఏజెంట్లకు శిక్షణ, అవగాహన కల్పిస్తూనే.. గ్రామాల వారిగా వచ్చిన పోలైన ఓట్ల వివరాలతో అంచనాలు వేస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే విజయ అవకాశాలు ఉన్నట్లు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. కొన్ని వైసీపీకి అనుకూలంగా చెప్పడం వల్ల ఆ పార్టీ నేతల్లోనూ జోష్ నెలకొంది. మరో పక్క రూ.లక్షలకు రూ.లక్షలు పందెం పెట్టిన బెట్టింగ్‌రాయుళ్లు మాత్రం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎంపీ అభ్యర్థులుగా టీడీపీ కురువ, వైసీపీ వాల్మీకి సామాజికవర్గాల అభ్యర్థులను బరిలో దింపడంతో పలు నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ భయం వెంటాడుతోంది.

జిల్లాలో కర్నూలు లోక్‌సభ స్థానం సహా 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 121 మంది బరిలో ఉన్నారు. టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య పోరు సాగింది. ఏపీ పీసీసీ సారధ్య బాధ్యతలు వైఎస్ షర్మిల చేపట్టడంతో కాంగ్రెస్ అభ్యర్థులు మేము సైతం అంటూ ఉనికి చాటుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేశారు. ఒక్కో నియోజకవర్గంలో దాదాపు రూ.50-60 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అనధికారిక సమాచారం. మే 13న ఓటర్లు ఇచ్చిన తీర్పు ఈవీఎంలో నిక్షిప్తమై ఉంది. పోలింగ్ తర్వాత వేసవి విడిది, విహార యాత్రలు, తీర్థయాత్రలకు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రముఖులు నియోజకవర్గ కేంద్రాలకు చేరుకున్నారు. ఓట్ల లెక్కింపు కోసం అధికార యంత్రాంగం ఓ వైపు కసరత్తు చేస్తోంది. మరో వైపు ఎగ్జిట్ పోల్స్ సర్వేల అంచనాలు, క్రాస్ ఓటింగ్ తీరుపై అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మాత్రం అధికార పార్టీ వైసీపీకే ఎక్కువ సీట్లు వచ్చేలా ఉన్నాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే ఉమ్మడి జిల్లాలో 1994, 1999 ఎన్నికల తరహాలో మెజార్టీ స్థానాలు టీడీపీ కూటమి దక్కించుకుంటుందని ఆ పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.

నిద్రలేని రాత్రులు

రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది.. ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు..? అంటూ జిల్లాలో రూ.కోట్లలో బెట్టింగ్ జరిగింది. శనివారం ఎగ్జిట్ పోల్స్ వచ్చాక కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని పెద్దఎత్తున బెట్టింగ్ పెట్టారు. ఆదోని మండలం బస్సాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆధ్వర్యంలో ఐదారుగురు కలిసి రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని దాదాపు రూ.కోటికి పైగా పందెం కాశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి గెలుస్తారని పెద్ద ఎత్తున బెట్టింగ్ పెట్టారు. మంత్రాలయం నియోజకవర్గంలో బహిరంగ చాలెంజ్‌కు దిగారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో బెట్టింగ్ జోరు సాగింది. ఎక్కువ శాతం రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ప్రభుత్వంపైనే పందేలు పెట్టారు. మంగళవారం ఓటర్లు తీర్పు వెలువడనుండడంతో బెట్టింగ్ రాయుళ్లు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

క్రాస్ ఓటింగ్ భయం

జిల్లాలో పలు నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ భయం అభ్యర్థులను వెంటాడుతోంది. కర్నూలు ఎంపీ అభ్యర్థులుగా కురువ సామాజిక వర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజును టీడీపీ బరిలో దింపితే.. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కర్నూలు మేయర్ బీవై రామయ్యను వైసీపీ పోటీలో నిలిపింది. పలు నియోజకవర్గాల్లో ఈ రెండు సామాజికవర్గాలు అభ్యర్థుల గెలుపోటములు నిర్దేశించే స్థాయిలో ఉండడమే క్రాస్ ఓటింగ్ భయానికి ప్రధాన కారణం. పత్తికొండ నియోజకవర్గంలో కురవ సామాజికవర్గం ఓటర్లు బలంగా ఉన్నారు. అయితే కురువలు పార్టీలకతీతంగా బస్తిపాటి నాగరాజును గెలుపించుకోవాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వైసీపీకి చెందిన కురువలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు క్రాస్ ఓటింగ్ వేసి ఉంటారన్న భయం వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను వెంటాడుతోంది. ఆదోనిలో కూటమి తరుపున బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధి పోటీ చేశారు. ఈయన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. వైసీపీకి చెందిన వాల్మీకులు, ఎమ్మెల్యేకు బీజేపీ అభ్యర్థి పార్థసారథికి, ఎంపీకి వచ్చే సరికి వైసీపీ అభ్యర్థి బీవై రామయ్యకు క్రాస్ ఓటింగ్ వేశారని వైసీపీ సాయిప్రసాద్‌రెడ్డి ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అదే క్రమంలో మంత్రాలయం నియోజకవర్గం నుంచి వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మాధవరం రాఘవేంద్రరెడ్డిని టీడీపీ బరిలో దింపింది. ఈ నియోజకవర్గంలో ఆ సామాజికవర్గం ఓటర్లే 85 వేలకు పైగా ఉన్నారు. పార్టీలకు అతీతంగా వాల్మీకి అభ్యర్థి రాఘవేంద్రరెడ్డిని గెలిపించుకోవాలని వాల్మీకి యువత విస్తృతంగా ప్రచారం చేసింది. వాల్మీకి సామాజికవర్గంలో కూడా ఎమ్మెల్యే ఓటు టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డికి, ఎంపీ ఓటు వైసీపీ అభ్యర్థి బీవై రామయ్యకు వేశారని తెలుస్తోంది. దీంతో వైసీపీ అభ్యర్థి బాలనాగిరెడ్డి, ఆయన అనుచరగణాన్ని క్రాస్ ఓటింగ్ భయం వెంటాడుతోంది. అలాగే.. ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాల్లో వైసీపీకి చెందిన కురవలు ఎంపీ ఓటు బస్తిపాటి నాగరాజుకు క్రాస్ ఓటు వేశారని, అదే క్రమంలో టీడీపీలో ఉంటున్న వాల్మీకులు కూడా కొందరు ఎంపీకి బీవై రామయ్యకు క్రాస్ ఓటింగ్ వేసినట్లు తెలుస్తోంది.

కాంట్రాక్టర్లకు కాసుల వర్షం

రైతు బజార్లలో నాసిరకంగా పనులు



సీ క్యాంపు రైతుబజారులో డ్రైనేజీ కాలువపై ధ్వంసమైన పెంకులు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 1: రైతులు పంట ఉత్పత్తుల విక్రయం ద్వారా వ్యాపారుల నుంచి వసూలైన సెస్సు ఆదాయం ఎంతో పొదుపుగా నాణ్యమైన పనులకు వెచ్చించాలి. అయితే చాలా మార్కెట్ కమిటీల్లో ఈ నిధులను విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. నాసిరకం పనులు చేయడం వల్ల కొద్ది నెలలకే ఈ పనుల్లో చోటు చేసుకున్న అక్రమాలు బట్టబయలవుతున్నాయి. కర్నూలు నగరంలో సీ.క్యాంపు రైతుబజారుతో పాటు అమీన్‌అబ్బాస్‌నగర్‌లో ఏర్పాటైన రైతుబజార్లలో చేపట్టిన వివిధ పనులకు సంబంధించి కొద్ది నెలలకే అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. సీ.క్యాంపు రైతుబజారులో రూ.20లక్షలు ఖర్చు పెట్టి కాలువలపై సిమెంటు పలకలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ పలకలు పగిలిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతూ నేలపైనే కూర్చుని వ్యాపారం చేసుకుంటున్నారు. సొంతంగా ఖర్చు చేసి బండలను కాల్వపై ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన టైల్స్ కూడా పగిలిపోయాయి. అదేవిధంగా అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజారులో ఏర్పాటు చేసిన టైల్స్‌తో పాటు దుకాణాల వద్ద కూడా వివిధ పనులు నాసిరకంగా నిర్మించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుబజార్లలో రైతుల వసతుల కోసం నాణ్యతతో కూడిన పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన బిపుల్ సైకియా




ఏర్పాట్లను పరిశీలిస్తున్న అబ్జర్వర్ బిపుల్ సైకియా, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 2: రాయలసీమ యూనివర్సిటీలోని పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఇంజనీరింగ్ బ్లాకులోని స్ట్రాంగ్ రూమ్‌ను, కౌంటింగ్ హాల్, కంట్రోల్ రూమ్‌లను ఆదివారం పాణ్యం నియోజకవర్గ కౌంటింగ్ అబ్జర్వర్ బిపుల్ సైకియా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్స్‌తో వైసీపీలో వణుకు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌తో వైసీపీ శ్రేణుల్లో వణుకు పుడుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని వైసీపీ పాలన నుంచి విముక్తి కోసం కూటమి వైపు ఓటర్లు మొగ్గు చూపారని ఆయన అన్నారు. ఒక్క అవకాశం అంటూ చేతగాని, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో నూకలు చెల్లాయని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు కార్మికులు అందరూ జగన్‌కు ఓటుతో తగిన బుద్ధి చెప్పనున్నారని, ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపుతో జగన్ ఇంటికి పోవడం ఖాయమని అన్నారు. జాతీయ మీడియా సంస్థలు రాష్ట్ర సర్వే సంస్థలు చేపట్టిన ఎగ్జిట్ పోల్స్‌తో వైసీపీకి దిమ్మ తిరిగిందని అన్నారు. జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల అరాచక పాలన అంతమవుతుందని అన్నారు.

రెండో ర్యాండమైజేషన్ పూర్తి



కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 2: ఈ నెల 4వ తేదీన కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన అబ్జర్వర్లకు వివరించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎస్‌బీసీ కాన్ఫరెన్స్ హాల్లో జనరల్ అబ్జర్వర్లు జాఫర్ మీర్‌తారీఖ్ ఆలీ సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్‌కు అవసరమైన సిబ్బందితో పాటు అదనంగా 20 శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచుకునేలా రెండో ర్యాండమైజేషన్ చేసినట్లు తెలిపారు. అందులో ఈవీఎం టేబుల్‌పై ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ పోస్టల్ బ్యాలెట్ టేబుల్‌పై ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్, అబ్జర్వర్ టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉండేలా కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారని అన్నారు.

కేంద్రంలో మార్షల్స్ ఏర్పాటు: కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏజెంట్లు ఏవైనా అవాంతరాలు కలిగిస్తే నియంత్రించడానికి ప్రతి ఫ్లోర్‌లో సివిల్ డ్రస్‌లో మార్షల్స్‌ను ఏర్పాటు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. నియోజక వర్గాల వారీగా ఫ్లోర్ ఎగ్జిట్ ప్లాన్ తయారు చేయించాలని ఆర్వోలకు సూచించారు. ప్రతి నియోజకవర్గం కౌంటింగ్ హాలు దగ్గర మెడికల్ టీమ్స్ ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌తో రెడీ ఉంచినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారిగా కౌంటింగ్ డేటాను అప్‌లోడు చేసే సమయంలో రౌండు వారిగా సమాచారాన్ని మీడియాకు షేర్ చేసేందుకు సమాచార శాఖ అధికారికి కూడా షేర్ చేయాలని ఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం కౌంటింగ్ అబ్జర్వర్ బిపుల్ సైకియా పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ కర్నూలు ఆర్వో భార్గవ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సి. బెళగల్, జూన్ 2: మండలంలోని పోలకల్లుకు చెందిన ముగ్గురు వ్యక్తులు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర ఉన్న కాలువ దగ్గర అమ్మడానికి సిద్ధంగా ఉంచుకున్న మద్యాన్ని పోలీసులు గుర్తించి దాడి చేశారు. 389 మద్యం ప్యాకెట్లను వదిలి నిందితులు పారిపోయారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. అలాగే చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి గ్రామాల మధ్య పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని 6 మోటార్ సైకిలు, వారి దగ్గర ఉన్న నగదు రూ 8200ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

నందికొట్కూరు, జూన్ 2: నందికొట్కూరు పట్టణంలో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌కు చెందిన షాలుమియా(52) బహిర్భూమికి వెళ్లారని, అదే సమయంలో వైన్ షాప్‌కు సమీపంలో పిడుగు పడడంతో షాలుమియా అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ, సామాజిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), జూన్ 2: రాజ్యాంగ హక్కుల్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సాహితీ, సామాజిక సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఇటీవల ఉపా చట్టం కింద విడుదలైన ప్రముఖ జర్నలిస్టు, న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ రాసిన 'అలుపెరుగని పోరాటం' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది వై. జయరాజు పుస్తకాన్ని ఆవిష్కరించగా, సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై. జయరాజు మాట్లాడుతూ వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక అభ్యుదయ వాదులందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రబీర్ పురకాయస్థ రాసిన పుస్తకం చాలా అవసరమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. విశ్రాంత ఆచార్యుడు ఎస్ మన్సూర్ రెహన్ మాట్లాడుతూ బీజేపీలో ఉన్న ప్రస్తుత పాలకులకు కమ్యూనిస్టులు, క్రైస్తవులు, ముస్లింలు, దళితులు అంటే నచ్చదని అన్నారు. నేడు 320 మంది జర్నలిస్టులు జైల్లో మగ్గుతున్నారని, 2023 మంది రిపోర్టర్లను చార్జిషీటు లేకుండా జైల్లో పెట్టినట్లు తెలిసిందన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను సైతం జైల్లో పెట్టిన ఘనత బీజేపీకి దక్కుతుందని విమర్శించారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ రాజ్యాంగం గురించి మాట్లాడేవాళ్లంటే మోదీకి రుచించదని, మందబలాన్ని అడ్డు పెట్టుకొని ఏదైనా చేయవచ్చనే భావనలో ఉన్నారని చెప్పారు. మతం మత్తును మనుషుల్లో ఎక్కించడం వల్ల బీజేపీ దేశాన్ని మరింతగా భ్రష్టుపట్టిందని అన్నారు. కర్నూలు సివిల్ ఫోరం అధ్యక్షుడు ప్రసాదశర్మ మాట్లాడుతూ సమాచార స్వేచ్ఛ కనుమరుగైందని, ప్రసార సాధనాలన్నీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. కార్యక్రమంలో నరసింహ తదితరులు మాట్లాడారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

బేతంచెర్ల, జూన్ 2 : బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన వడ్ల హరి ప్రసాద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రియతమ్ రెడ్డి తెలిపారు. ఆదివారం సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ నాయక్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రుద్రవరం గ్రామానికి చెందిన బాణాల హరిప్రసాద్ (38) గత మే నెల 25న అదే గ్రామానికి చెందిన కొత్త గొల్ల వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల వెంకటసుబ్బయ్య, బీసన్నగారి చిన్న మద్దయ్యలు రుద్రవరం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు బాణాల హరిప్రసాద్, వెంకటేశ్వర్లుపై కట్టెలు, రాళ్లు, పిడిబాకుతో దాడి చేశారు. బాణాల హరిప్రసాద్‌ను హత్య చేసి పరారయ్యారు. నిందితులను సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది తిరుపాల్‌నాయక్, దస్తగిరి, గురువాబు, సురేష్ కుమార్, మద్దిలేటి, రాజు నాయక్‌ల సహాయంతో సీతారామాపురం మెట్ట వద్ద ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు.హత్యకు ఉపయోగించిన కట్టె, రాయి, పిడి బాకును స్వాధీనం చేసుకుని నిందితులను డోన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ నిందితులను రిమాండ్‌కు ఆదేశించారు.



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్‌ఐ శివశంకర్ నాయక్

ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు అధికారుల నియామకం

నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4న నిర్వహించే పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం, ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు భారత ఎన్నికల సంఘం సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమంచిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి దినేష్ కుమార్, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గానికి భగవత్ కిషోర్ మిశ్రా, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గానికి అభిజిత్ ముఖర్జీ, నంద్యాలకు రాహుల్ సింగ్, బలనగాన పల్లెకు ప్రకాష్ మిశ్రా, డోన్‌కు అమిత్ కుమార్‌లను పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమంచిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంబంధించి రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ, ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై సూచనలు చేశామని తెలిపారు.

కర్నూలు

సమన్వయంతో సమస్యను పరిష్కరించండి

● పీపీఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ. పుల్లారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 2: రైల్వే శాఖ, నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో ప్రజల సమస్యను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం క్రిష్ణానగర్ రైల్వే గేట్ సమీపంలో కమిటీ బృందం పర్యటించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ నగరంలో రైల్వే శాఖ, నగర పాలక సంస్థ అధికారుల సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారిందన్నారు. రెండు రోజుల క్రితం దేవనగర్ రైల్వే కమ్మీల వద్ద పైప్‌లైన్ మరమ్మతులు గురికావడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని ఆయన అన్నారు. దేవనగర్ రైల్వే గేటు వద్ద మురుగునీరు నిలిచి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సివి.వర్మ, కే.శ్రీనివాసులు, ఎన్.మద్దిలేటి, జి.లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 2: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడే ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోట్ల చంద్రశేఖర్, రత్నం ఏసేపు డిమాండ్ చేశారు. 17న జిల్లా కౌన్సిల్ వార్షిక సమావేశం స్థానిక టౌన్ మోడల్ హైస్కూల్‌లో ఆదివారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ అధ్యక్షతన జరిగింది. అనంతరం డీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నూత అధ్యక్షులుగా వీజీ వెంకట్రాముడు, ప్రధాన కార్యదర్శిగా గట్టు తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా గీత, నాగరాజుగౌడు, ఈశ్వర్ రెడ్డి, రోశన్న, జిల్లా కార్యదర్శులుగా రామన్న, గంగాధర్, వెంకటేశప్ప, ముద్దు రంగప్ప, రమేష్, రాష్ట్ర కౌన్సిలర్‌గా కరెకృష్ణ, గోట్ల చంద్రశేఖర్, మద్దయ్య, మనోరంజని, రవీంద్ర, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయులను ప్రధానంగా బోధనేతరనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, గత 20 సంవత్సరాల పెండింగ్‌లో ఉన్న సర్వీసు రూల్స్‌ను అమలు చేసి అర్హులైన స్కూల్ అసిస్టెట్ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలని క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండలాల బాధ్యులు, జిల్లా బాధ్యులు, బజారు, బాషా, సాయిబాబు, ఉసేని, మనోహర్, కిసోర్, నాగన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు




గూడూరు ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ హనుమంతయ్య

గూడూరు, జూన్ 2: ఎవరైనా ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని గూడూరు ఎస్ఐ హనుమంతయ్య హెచ్చరించారు. ఆదివారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ హనుమంతయ్య ఆధ్వర్యంలో పోలీసులు అన్ని గ్రామాల్లో పర్యటించి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఎస్ఐ హనుమంతయ్య గ్రామస్థులతో మాట్లాడుతూ 4న కౌంటింగ్ సందర్భంగా ఎవ్వరైనా కూడా ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే పరిణామాలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

'దేశవ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్ అమలు కావాలి'

కర్నూలు(కల్చరల్), జూన్ 2: దేశ వ్యాప్తంగా యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం నగరంలోని నరసింహారెడ్డి నగర్‌లోగల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూసీసీ దేశానికి నేడు ఎంతో అవసరమని అన్నారు. పర్సనల్ లా, సోషల్ లా అందరికీ సమానం కావాలని అన్నారు. పెళ్లి, విడాకులు, ఆస్తి వారసత్వం అంశాలను యూసీసీలో నిర్ధారించారని, మతం బంధంతో వివక్షకు గురైతే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. 18-22 ఏళ్ల మధ్య వారు జీవన సంబంధంలో ఉన్నట్లయితే తల్లిదండ్రుల నుంచి అనుమతి ఉండేలా యూసీసీ చెబుతుందని తెలిపారు. యూసీసీ ఉత్తరాఖండ్‌లో అమలు అవుతోందని, రాజస్థాన్‌లోనూ అమలు కాబోతోందని చెప్పారు. ప్రతి మతంలో అందరికీ సమానత్వం ఉండాలని, దేశ వ్యాప్తంగా యూసీసీ అమలు అయితే జీవన సంబంధాలు మెరుగుపడి దేశం సనాతన ధర్మం వైపు నడుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.



పశుఘోష

కోడుమూరు/గూడూరు, జూన్ 2: వర్షాభావ పరిస్థితులతో కొండలు, గుట్టల్లో పచ్చదనం కనుమరుగైంది. మూగ జీవాలకు ఎక్కడా పశుగ్రాసం దొరకడం లేదు. మూడు నెలల నుంచి ఎండల తీవ్రత పెరగడంతో ఎటు చూసినా ఎండిన పొలాలే కనిపిస్తున్నాయి. మైదానాలు ఎడారిని తలపిస్తున్నాయి. దీంతో ఊళ్లలో పశువులు, గొర్రెల పోషణ కష్టమైపోయింది. విధిలేని పరిస్థితుల్లో రైతులు వాటిని అమ్ముకుంటున్నారు. కొంతమంది రైతులు మాత్రం ట్రాక్టర్ గడ్డి రూ.15 వేలకు తెచ్చుకుంటున్నారు.

» ఎండలతో పచ్చదనం కనుమరుగు
» గడ్డి దొరకక మూగజీవాల యాతన
» నీరు లేక చెరువులు, కుంటలు వెలవెల
» పశువులను అమ్ముకుంటున్న యజమానులు



కోడుమూరు మండలంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు సుమారు 70వేలకు పైగా ఉన్నాయి. వీటికి కను చూపు మేరలో పచ్చిక కనిపించడం లేదు. ఇళ్ల వద్ద కట్టేసి మేత వేయడం దుర్భర మైపోయింది. గొర్రె లు, మేకలను అడవులకు తోలకపోతే పచ్చిమేత దొరకక ఎండుపుల్లలు ఏరుకొని తింటున్నాయి. రైతులు దినదినగండంగా ఆకాశం వైపు వాన కోసం ఎదురు చూస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని యజమానులు ఆందోళన చెందుతున్నారు.

సంప్రదాయ పంటలు ఏవి?

ఒకప్పుడు రైతులు సంప్రదాయ పంటలు సాగు చేసేవారు. వాటి వల్ల పశువులకు మేత దొరికేది. వేరుశనగ, కంది, పెసర, సజ్జ, జొన్న వంటి పంటలు సాగు చేయడం వల్ల పశుగ్రాసానికి పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. వాణిజ్య పంటల సాగు పెరిగాక పశువుల మేత కరువైపో యింది. పాడి మీదే ఆధారపడిన వాళ్లకు కూడా పశుగ్రాసానికి వేలకువేలు ఖర్చు పెట్టడం కష్టమైపోయింది. ఈ సీజన్‌లో ట్రాక్టర్ వరిగడ్డి రూ.16 వేలకు పైగా ధర పలుకుతుంది. రైతులకు ఇంత ఖర్చు పెట్టడం కష్టం. దీంతో పశువులను అమ్ముకుంటున్నారు. బక్క చిక్కిన పశువులను కబేళాకు తోలుతున్నారు. కుంటలు, చెరువుల్లో కూడా నీరు కరువైంది.



పశువులకు మేత కరువు

గూడూరు మండలంలో పశువులకు మేత కరువైంది. మొత్తం 3340 మూగ జీవాలు ఉన్నాయి. ఇందులో ఆవులు, ఎద్దులు 2096, బర్రెలు, దున్నపోతులు 1244, గొర్రెలు 18426, మేకలు 4588 ఉన్నాయి. అయితే ఈ సీజన్‌లో వర్షాలు కురవక పోవడంతో ఈ పశువులకు మేత కరువైంది. అలాగే పశువుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. పశువులకు మేత అందించేందుకు ప్రభుత్వం పాతరగడ్డి పంపిణీ చేసినప్పటికీ అది ఏ మాత్రం సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులు, వంకలు ఎండిపోయాయి. పాతరగడ్డి 132 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు పశువైద్య అధికారులు వెల్లడిస్తున్నారు.



గూడూరులో ఎండిపోయిన వేరుశనగ పంట (ఫైల్)



కోడుమూరు వద్ద నీరు లేని హంద్రీ

పశుపోషణ భారమైంది

వ్యవసాయంలో లాభాలు వస్తాయో.. లేదో కానీ పాడి పశువుల పోషణ మాత్రం చాలా కష్టంగా మారింది. వరుసగా కరువు రావడంతో అడవిలో మేత దొరకడం లేదు. రెండు ఎద్దులు, ఆరు గేదెలను పోషించుకోలేని పరిస్థితి ఏర్పడింది. సుమారు లక్ష రూపాయలు వెచ్చించి పశుగ్రాసం కొనుగోలు చేశాను. రాబో యే రోజుల్లో అయినా వానలు కురిస్తే పర్వాలేదు. లేకపోతే పశుపోషణ భారమే.

- నారాయణ, కోడుమూరు

ఇబ్బందులు పడుతున్నాం..

గత కొన్నేళ్లుగా గొర్రెల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తున్నా. ఈ ఏడాది ప్రారంభం నుంచి వానలు లేవు. అడవిలో పచ్చిమేత దొరకడం లేదు. వంకలు, వాగుల్లో కూడా మూగ జీవాలు తాగడానికి గుక్కెడు నీళ్లు లేవు. ఆరుగురు వ్యక్తులం కలిసి 2వేల జీవాలకు మేత, నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్నాం.

- రాఘవేంద్ర, గొర్రెల యజమాని, గూడూరు

గ్రాసం దొరకడం లేదు...

ఈ ఏడాది ఉన్నంత కరువు ఎప్పుడు చూడలేదు. ఎక్కడ చూసిన చుక్కనీరు దొరకడం లేదు. అలాగే గ్రాసం కూడా కరువైంది. దీంతో పశుపోషణ కరువైంది. ట్రాక్టర్ వరిగడ్డి తెలంగాణ ప్రాంతానికి వెళ్లి రూ.16వేలు కొనుగోలు చేస్తున్నాం. గత ఏడాది వరకు 30 దాకా అవులు, బర్రెలు ఉండేవి. ప్రస్తుతం 10 వరకు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి గ్రాసం అందించాలి.

- శ్రీను, కోడుమూరు

ఘనంగా ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు(కల్చరల్), జూన్ 2: నగరంలోని ఎన్ఆర్ పేటలోగల శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం ఆధ్వర్యంలో కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం రాత్రి ఘనంగా ముగిసింది. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ముగింపు వేడుకలను విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ కొట్టే చెన్నయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యాలకు నేడు ఆదరణ పెరిగిందని, మన దేశ సంస్కృతిలో భాగమైన కళలను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు కళలను ఎంపిక చేసుకొని వాటిలో శిక్షణ తీసుకోవడం స్ఫూర్తిదాయకంగా ఉందని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను వేసవి సెలవుల్లో ఈ శిక్షణకు పంపి వారిలో కూచిపూడి నృత్యం పట్ల ఆసక్తి పెంపొందించడం అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా కళా నిలయం అధ్యక్షురాలు బెస్త మల్లీశ్వరి ఆధ్వర్యంలో నృత్య శిక్షణలు పొందిన కళాకారులు ప్రదర్శించిన వివిధ కూచిపూడి నృత్య రూపకాలు, జానపద నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. నృత్య శిక్షకురాలు దేవీశ్రీ ప్రదర్శించిన 'సింహనందిని' నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో భాగంగా దేవీశ్రీని టీజీవీ కళాక్షేత్రం పక్షాన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఘనంగా సత్కరించారు.



వేసవి శిక్షణ ముగింపు వేడుకలను ప్రారంభిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కూటమి విజయం తథ్యం



బీరప్ప గుడిలో పూజలు చేస్తున్న బస్తిపాటి నాగరాజు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 2: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం తథ్యమని కర్నూలు టీడీపీ పార్లమెంటు అభ్యర్థి బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం మాదాసి కురువ, మాదారి కురువ సంఘం నగర కమిటీ అధ్యక్షుడు కురువ ఆరాధ్య దైవం బీరప్పస్వామి గుడిలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి విజయం సాధించి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాలు, టీడీపీ బారీ మెజారిటీతో విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో రామక్రిష్ణ, రవి, శివ నారాయణ, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌తో తైక్వాండో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

కర్నూలు(కల్చరల్), జూన్ 2: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం సంకల్‌బాగ్‌లోని ఆయన నివాసంలో టీజీవీ అండ్ టీజీబీ స్పోర్ట్స్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులకు ఆయన బెల్టులు ప్రదానం చేశారు. అలాగే వారికి పౌష్టికాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తైక్వాండో ఆత్మరక్షణ క్రీడ అని, ఇది మేధోశక్తితోపాటు శారీరక వికాసానికి ఉపకరిస్తుందని అన్నారు. టీజీవీ అండ్ టీజీబీ స్పోర్ట్స్ అకాడమీ ద్వారా శిక్షణలు తీసుకుంటున్న విద్యార్థులను ఆయన అభినందించారు. భవిషత్తులో క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. తైక్వాండో క్రీడా శిక్షకుడు టి. వెంకటేశ్ మాట్లాడుతూ టీజీవీ అండ్ టీజీబీ స్పోర్ట్స్ అకాడమీకి టీజీ వెంకటేశ్, టీజీ భరత్‌లు ఎంతో సహాయ సహకారాలు అందిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని, అందుకు క్రీడాకారులు రుణపడి ఉంటారని చెప్పారు. తైక్వాండో క్రీడకు ఒలంపిక్స్ క్రీడల్లో గుర్తింపు ఉందని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో క్రీడా శిక్షకులు నాగరాజ్, అరుణ్, ప్రతీష్, సూర్యభార్గవ్, మల్లేష్, విశ్వాస్, శ్రీలలిత, అఖిల్‌సాయి, హరికృష్ణ, శివమణి, శివశంకర్, మధుసూదన్ పాల్గొన్నారు.

భగవద్గీత త్రైత్త సిద్ధాంతంపై అవగాహన

ఓర్వకల్లు, జూన్ 2: మండలంలోని ఉప్పలపాడు, కాల్వబుగ్గ గ్రామాల్లో త్రైత్త సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక మిడుతూరు కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో శనివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులస్వామి త్రైత్త సిద్ధాంత భగవద్గీత ప్రవచనాలు చేశారు. భగవద్గీతలోని 16, 17 శ్లోకాల్లో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి ప్రవచనం చేశారు. కార్యక్రమంలో హిందూ జ్ఞాన వేదిక మిడుతూరు కమిటీ సభ్యులు రామచంద్రుడు, శ్రీనివాసులు, రాఘవేంద్ర, సుజాత, హైమావతి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

తుది దశకు చేరిన కౌంటింగ్ ప్రక్రియ

● ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణ ● ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



కర్నూలు, జూన్ 2: 2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి ఘట్టానికి చేరుకుంది. మరో 24 గంటల్లో ఈ ప్రక్రియ ముగిసిపోనుంది. కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో ప్రారంభం కానున్న నేపథ్యంలో కౌంటింగ్ సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ ఎలా సాగుతుంది.. కౌంటింగ్ ఎలా చేస్తారన్నదానిపై అందరిలోనూ ఉత్కంఠ ఉంది. ఈ కౌంటింగ్‌కు సంబంధించి ఆంధ్రజ్యోతి అందిస్తున్న కథనం..

● మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించే ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఉదయం 6 గంటలలోపు అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది చేరకోవాలి

కౌంటింగ్ సిబ్బంది తీసుకెళ్లాల్సినవి :

● ఫార్మ్-18 డిక్లరేషన్, డ్యూటీ ఆర్డర్, ఐడీ బ్యాడ్జీ, ఆధార్, ఏదైనా ఫోటో ఐడీ, ఒక నోటు పుస్తకం, పెన్ను, ఫార్మ్-17సీ, ముఖ్యమైన టాబ్లెట్లు వెంట తెచ్చుకోవాలి.

● మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకూడదు. ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లిన తర్వాత బయటకు రావాడానికి వీలుండదు. సిబ్బందికి అలాట్ చేసిన టేబుల్ వద్దనే కూర్చోవాలి. ఇంకెక్కడైనా తిరగకూడదు. ● కౌంటింగ్ సిబ్బంది, పెన్సింగ్ చేసిన లోపల భాగంలో తమకు కేటాయించిన టేబుల్ వద్ద కూర్చుంటారు. ఏజెంట్లు పెన్సింగ్ బయట కూర్చుంటారు. 14 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగింది. పార్లమెంటు అసెంబ్లీకి వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు.

కౌంటింగ్ సిబ్బంది ఇవి చెక్ చేయాలి:

● 'ఎం' అని నోట్ చేసి ఉంటే మీకు వచ్చిన సీయులో మాక్‌పోల్ డిఫెక్ట్ ఉన్నదేమో పరిశీలించాలి.

● 'డీ' అని నోట్ చేసి ఉంటే మీరు 2సీయులో రిజల్ట్ చెక్ చేయాలి.

● పొరపాటున పీవోలు క్లోజ్ బటన్ ప్రెస్ చేసి ఉండకపోతే క్లోజ్ చేసిన తర్వాత రిజల్ట్ చూసుకోవాలి.

ఇదీ ఏర్పాటు:

● ఒక్కొక్క టేబుల్ వద్ద ఒక్క కౌంటింగ్ సూపర్‌వైజర్ ఒక కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ఆర్వో, ఏఆర్వో ఏజెంట్లు, ఉంటారు.

● పోస్టల్ బ్యాలెట్ వద్ద కూడా ఆర్వో ఏజెంట్లు ఉంటారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా:

● మొదట కౌంటింగ్ ప్రక్రియ పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభమవుతుంది.

● పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ఆరంభించిన అరగంట తర్వాత ఈవీఎం కౌంటింగ్ మొదలవుతుంది.

ఈవీఎంలు కౌంటింగ్ ఇలా లెక్కిస్తారు.

● ముందుగా నిర్ధారించిన పోలింగ్ స్టేషన్ ఈవీఎం (కంట్రోల్ యూనిట్) మీ టేబుల్ వద్దకు వస్తుంది.

● కంట్రోల్ యూనిట్ కేసు మీ వద్దకు తీసుకుని వచ్చినప్పుడు ముందుగా అడ్రస్ ట్యాగ్ సీల్ వెరిఫై చేయాలి

● కంట్రోల్ యూనిట్ ఓపెన్ చేసిన తర్వాత కంట్రోల్ యూనిట్ అడ్రస్ ట్యాగ్‌లు, గ్రీన్ పేపర్ సీల్ సరిగ్గా ఉండా లేదా చెక్ చేసుకోవాలి .● గ్రీన్ పేపర్ సీల్ సరిగ్గా ఉన్నట్లయితే దానిని కట్ చేసి రిజల్ట్ చేసి రిజల్ట్ డోర్ ఓపెన్ చేస్తారు.

● రిజల్ట్ బటన్ ప్రెస్ చేసేముందు కేసులో ఉన్న ఫార్మ్-17సీని బయటకుతీసి, పోలింగ్ స్టేషన్ నెంబరు కంట్రోల్ యూనిట్ నెంబరు పోలైన మొత్తం ఓట్లు చెక్ చేస్తారు.

● రిజల్ట్ బటన్ ప్రెస్ చేస్తారు. ముందుగా పోలింగ్ తేదీ వివరాలు, మొత్తం ఓట్లు పోలైన వివరాలు డిస్‌ప్లే అవుతాయి. మొత్తం పోలైన ఓట్లు ఫార్మ్-17సీతో సరిపోల్చుకోవాలి (సరికాకపోతే వెంటనే ఆర్వోకు తెలియజేయాలి. ఆర్వో ఆ మిషన్ తీసుకెళ్లడంతో ఆ రౌండు ఖాళీ ఉంటుంది)

● నోట్ చేసుకున్నవన్నీ కూడా కౌంటింగ్ సూపర్‌వైజర్లు 17సీలో అభ్యర్థికి ఎన్ని వచ్చాయి. అనేది నోట్ చేసుకుంటారు.

● ఒకవేళ రిజల్ట్ మళ్లీ చూడాలనుకుంటే ఆర్వో పర్మిషన్ తీసుకుని మరలా రిజల్ట్ బటన్ ప్రెస్ చేయవచ్చు. అంతా సవ్యంగా ఉంటే కౌంటింగ్ సూపర్‌వైజర్ ఫార్మ్-17సీలో రిజల్ట్ వివరాలు నోటాతో సహా నమోదు చేసి ఏజెంట్లు సంతకం చేయిస్తారు

● ఫార్మ్-17సీ మొత్త 3 కాపీలు తయారు చేసుకుని ఒకటి ఆర్వో, ఒకటి ఏజెంటుకు ఇచ్చి మూడోది అధికారి దగ్గర ఉంచుకోవాలి.

● కౌంటింగ్ సూపర్‌వైజర్ ప్రతి సీయుకి రిజల్ట్ చెక్ చేసిన అనంతరం సర్టిఫై చేసి ఇస్తారు..

● వివరాలు ఆర్వోకు అందజేసిన తర్వాత బోర్డు మీద రాసి రిజల్ట్ అనౌన్స్ చేస్తారు. అలా మొదటి రౌండ్ పూర్తవుతుంది.

● తర్వాత రెండో కంట్రోల్ యూనిట్ వస్తుంది. అదే విదంగా అన్ని కంట్రోల్ యూనిట్లు లెక్కింపు పూర్తయ్యే వరకు కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది.

● అన్ని కంట్రోల్ యూనిట్లు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యాక లాటరీ పద్ధతిలో ఒక 5 వీవీ ప్యాట్‌ల మిషన్ల నుంచి స్లిప్పుల్ని తీసి వాటిని కౌంట్ చేస్తారు. ఓటరు స్లిప్పులు పారం-17సీ కంట్రోల్ యూనిట్‌లో మొత్తం సరిపోయిందో లేదో టాలీ సరిపోల్చుతారు. అన్ని సమానంగా ఉంటే రిజల్ట్ డిక్లేర్ చేస్తారు ఇలా కాకుంటే ఓటురు స్లిప్పుల సంఖ్యనే పరిగణిస్తారు.

సాధారణంగా వచ్చే సమస్యలు:

● సీలింగ్ సరిగ్గా లేకపోవడం
● గ్రీన్ పేపర్ సీల్ బ్రేక్ అవడం
● కంట్రోల్ యూనిట్ ఆన్ అవకపోవడం

(ఒకవేళ ఆన్ కాకపోతే ఆర్వో కొత్త బ్యాటరీ పెడితే ఆన్ అవుతుంది) అప్పటికీ ఆన్ కాకపోతే కంట్రోల్ యూనిట్‌ను పక్కన పెడుతారు. దానికి సంబంధించిన వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు)

● కంట్రోల్ యూనిట్ లో నెంబరు ఫారం-17సీ కంటే ఎక్కువగా ఉన్నట్లయితే వీవీప్యాట్ తెప్పించి మాక్‌పోల్ స్లిప్పులు ఉండే కవర్ తెప్పించి అదనంగా ఉన్న మాక్ పోల్ స్లిప్పులు సంఖ్యను తొలగించి రిజల్ట్ అనౌన్స్ చేస్తారు. ఎక్కడైనా తేడాలు ఉన్నట్లయితే ఆర్వో దృష్టికి తీసుకెళ్లి సరి చూసుకోవాలి.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమే

● ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి



ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు రమేష్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 2: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని, ఉద్యోగంలో చేసిన మంచి పనులే శాశ్వతంగా గుర్తుండిపోతాయని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జోహార్ రెడ్డి అన్నారు. ఆదివారం ద్వారక ఫంక్షన్ హాలులో ఏపీ ఎన్జీవో తాలూకా అధ్యక్షుడు రమేష్ రెడ్డి పదవి విరమణ పొందడంతో అయనను ఏపీ ఎన్జీవో ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఫార్మసిస్టుగా 31 ఏళ్ల పాటు పనిచేసి, మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఏపీ ఎన్జీవో సంఘానికి 20 ఏళ్ల పాటు అధ్యక్షుడిగా ఉంటూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో ఉద్యోగ సంఘ నేతగా కొన్ని నెలల పాటు దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఎన్నో ఉద్యమాలు చేసిన పోరాటపటిమను మరవలేనిది అన్నారు. పదవి విరమణ అనంతరం తన శేషజీవితం అంతా కుటుంబంతో సంతోషంగా ఉండాలని కోరారు. ఈ నెలలో ఏపీ ఎన్జీవో తాలూకా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి పదవి విరమణ చేస్తుండడంతో ఆయనను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసిన్, రఘురామయ్య నాగరాజు, విజయ్, నరసయ్య గౌడ్, రజనీకాంత్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలంటూ వీరభద్రగౌడ్ పూజలు



భీమలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న వీరభద్రగౌడ్

ఆలూరు, జూన్ 2: చంద్రబాబు సీఎం కావాలని కాంక్షిస్తూ ఆదివారం పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివుడి ఆశీర్వాదంతో 4న జరిగే కౌంటింగ్‌లో టీడీపీకి అనుకూల ఫలితాలు రాబోతునాయన్నారు. ఎగ్జిట్ పోల్స్ కూడా ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందని చెబుతున్నాయన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఆదోని టౌన్, జూన్ 2: ఉపాధ్యాయ వృత్తికి ఎంతో ప్రాధాన్యత ఉందని, సమాజంలో మంచి అలవాట్లు, మంచి నడవడిక, సంస్కారాన్ని విద్యార్థులు ఉపాధ్యాయులతోనే నేర్చుకుంటారని జంగమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి అన్నారు. జంగమ సంఘానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ స్వామి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం ఆయనను జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్మషం లేని ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో గౌరవం ఉంటుందన్నారు. తమ జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు విద్యార్థులు జీవితాంతం రుణపడి ఉండాలన్నారు. ఆదోని డివిజన్ అధ్యక్షుడు పురుషోత్తం, ఎండీ భద్రీనాథ్ స్వామి, మంజునాథ్ పాల్గొన్నారు.

నగదు భిక్షాటనను ప్రోత్సహించరాదు

ఆదోని టౌన్, జూన్ 2: దేశంలో నగదు భిక్షాటన అంతం కోసం బెంగళూరులో ప్రారంభమైన బెగ్గర్స్ ఫ్రీ భారత్ ఉద్యమానికి ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్, గోపీనాథ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, చిన్నారులను ఎత్తుకెళ్లి వారితో భిక్షటన చేయించే ముఠాల ఆగడాలకు చెక్ పెట్టాలంటే నగదు భిక్షాటనకు వ్యతిరేకించాలని అన్నారు. ఆకలితో ఉన్న అనాథలకు నగదు కన్నా ఆహారం, నీరు అందించి వారి ఆకలిని తీర్చడం ఎంతో శ్రేయష్కరం అన్నారు. ఈ విషయంపై ప్రజలలో ఎక్కువగా ప్రచారం జరగాల్సిన అవసరం ఉందన్నారు.

మంత్రాలయం గర్భగుడి స్వర్ణమయం

● వచ్చే ఆరాధనకల్లా ఒక వైపు పూర్తికి సన్నాహాలు



మంత్రాలయం, జూన్ 2: రాఘవేంద్ర స్వామి గర్భగుడి శిలామండపం పైభాగం బంగారు కాంతులతో దర్శన మివ్వనుంది. ఇప్పటికే తూర్పు వైపున రాగితో కవచాలు ఏర్పాటు చేసి స్వర్ణంతో సుందరంగా ఆధునీకరించి తయారు చేసిన రేకులను అమర్చుతున్నారు. బంగారు కాంతుల మధ్య శ్రీమఠం శిలామండపం శోభిల్లుతుంది. ఆగస్టు మాసంలో జరిగే రాఘవేంద్ర స్వామి ఉత్సవాల్లోపుఒక వైపు బంగారు కవచాలతో అలంకరణ చేసే పనులు చురుగ్గ సాగుతున్నాయి. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్‌లు దగ్గరుండి గర్భగుడి శిలామండపాన్ని స్వర్ణమయం చేసేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ పనులను చురుగ్గా సాగిస్తున్నారు.

స్వర్ణ పల్లకిలో దర్శనమిచ్చిన రాఘవేంద్రులు : వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం వైశాఖ నవమిని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మఠం అర్చకులు బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వర్ణపల్లకీలో అధిష్టించి వైభవంగా ఊరేగించారు.

2ఏడీఎస్7 : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారు

● మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ఆదోని టౌన్, జూన్ 2: డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు వస్తేనే రాష్ట్ర అభివృద్ధికి అవకాశం ఉంటుందన్న నమ్మకంతో ఎన్డీఏ ఉమ్మడి కూటమి అభ్యర్థులకు ఓటు వేశారని బీజేపీ రాష్ట్ర అన్యభాష కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో పదివేల మంది దాకా మొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకున్న యువ ఓటర్లు మోదీ పాలనపై విశ్వాసంతో ఓటేశారన్నారు. రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి జరగకపోగా గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సొంత పథకాలకు మళ్లించడంతో గ్రామ ప్రజలు విసిగిపోయి తమ ఓటును ఎన్డీఏ ఉమ్మడి కూటమి అభ్యర్థులకు వేశారని అన్నారు. కేంద్రంలో 350కు పైగా స్థానాలలో విజయం సాధించి, మోదీ మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని జోస్యం పలికారు.

ఆలూరులో వరుస చోరీలు

● తాళం వేసిన ఇళ్లే టార్గెట్
● ఒకే కాలనీలో మూడు ఇళ్లలో భారీగా బంగారు అపహరణ



ఆలూరులో బీరువాను, ఇంటి గడియను పగలగొట్టిన దొంగలు (ఫైల్)



ఆలూరు, జూన్ 2 : ఆలూరు పట్టణంలో వరుస చోరీలతో జనం బెంబేలెత్తుతున్నారు. వేసవి సెలవులు కావడంతో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో ఉన్న ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ గురునాథ్ వేసవి సెలవులకు బెంగళూరుకు వెళ్లడంతో గత నెల 9న తాళం పగలగొట్టి, ఇంట్లో ఉన్న బీరువా పగలగొట్టి అందులో ఉన్న 14 తులాల బంగారం అపహరించుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీమ్ రంగంలోకి దిగి, చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. అదే ఇంటి పక్కన ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుడు వీరేష్ వేసవి సెలవులకు ఊరికి వెళ్లడంతో శనివారం రాత్రి ఇంట్లో చొరబడి, 30 తులాల వెండి, 3 తులాల బంగారు దోచుకెళ్లారు. అలాగే వాటర్ ప్లాంట్ శేఖర్ ఇంట్లో కూడా చోరీకు పాల్పడ్డారు.

● **చోరీలకు పాల్పడేదెవరు ?**

ఆలూరులో గతంలో కూడా ఇల్లు, ఆలయాల్లో వరుస చోరీలు జరిగాయి. తాజాగా జరుగుతున్న చోరీలకు పాల్పడుతుండేవారు ? స్థానికంగా ఉండే వారా ? లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో బళ్లారి, గుంతకల్, ఆదోనికు చెందిన కొందరు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. గతంలో కొందరు యువకులు మద్యానికి బానిసలై దొంగతనాలు చేశారు. దీంతో పోలీసులు పాత నేరస్తులను కూడా విచారిస్తున్నారు. రాత్రి సమయంలో పూర్తి స్థాయిలో గస్తీ జరగకపోవడం వల్ల చోరీలు జరుగుతున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఊర్లకు వెళ్లే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇస్తే, ఆ ఇంటిపై నిఘా ఉంచుతామని పోలీసులు తెలిపారు. ఏది ఏమైనప్పటికీ చోరీలకు పాల్పడే గ్యాంగ్‌ను గుర్తించి చోరీ జరిగిన సొమ్మును రికవరి చేయాలని బాధితులు కోరుతున్నారు.

విజయోత్సవాలకు అనుమతి లేదు



ఎమ్మిగనూరులో విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

ఆదోని, జూన్ 2: ఎన్నికల ఫలితాలను పురస్కరించుకొని మంగళవారం ఆదోని సబ్ డివిజన్ పరిధిలో విజయోత్సవ ర్యాలీలు, వేడుకలు నిర్వహించడానికి అనుమతి లేదని ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆదోని సబ్ డివిజన్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎలాంటి విజయోత్సవాలు, ర్యాలీలు జరుపకూడదన్నారు. బాణాసంచా కాల్చడం, డీజే వినియోగం, బైక్ ర్యాలీలు, ఇతర ర్యాలీలతోపాటు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహణ, గుంపులుగా తిరగడం నిషేధం అని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు, కార్యకర్తలతో పాటు ఓటమి పాలైన పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం సమన్వయంతో వ్యవహరిస్తూ పోలీసులకు పూర్తి సహకారాన్ని అందించాలన్నారు. పోలీసుల నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు

దేవనకొండ : ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి ,ఒంగోలు పోలీసు ట్రైనింగ్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దేవనకొండ పోలీసు స్టేషన్లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం అయ్యారు. సార్వత్రిక ఫలితాల నేపథ్యంలో బాణాసంచా కాల్చడం ,సంబరాలు చేసుకోవడం లాంటి ఘటనలు చేస్తే ఎవ్వరినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమన్నారు. ఆడంభరాలకు దూరంగా ఉండాలన్నారు. సీఐ శ్రీనివాసులు, ఎస్సై రాజారావు తదితరులు ఉన్నారు.

ప్రశాంతతకు సహకరించండి

ఎమ్మిగనూరుటౌన్ : కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా ప్రశాంతతకు అందరూ సహకరించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో సెక్షన్ 144, పోలీసు యాక్టు 30 అమల్లో ఉంటుందన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ సందర్భంగా ప్రజలు సహకరించాలని, పోలీసుల సూచనలను పాటించి ప్రశాంతంగా ఉండాలని కోరారు. సమావేశంలో సీఐలు మధుసూధన్‌రావు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సహనం పాటించండి.. గెలుపు మనదే

● టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి



4 మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూన్ 2: ఎన్నికల ఓట్ల లెక్కింపు ముందు, అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సహనం పాటించాలని గెలుపు మనదేనని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన నివాసం మాధవరంలో విలేకరులతో మాట్లాడుతూ జూన్ 3వ తేదీ నుంచి 4వ తేదీ ఎన్నికల ఫలితాల వరకు పోలీసులు, ఎన్నికల అధికారులకు కూటమి నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. కౌంటింగ్ ఏజెంట్లు సైతం ఓపిగ్గా ఉండాలని కోరారు. గ్రామాల్లోనూ పోలీసుల అధికారుల 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరూ ఫ్యాక్షన్, గొడవలకు అల్లర్లకు వెళ్లకూడదని సూచించారు. మంత్రాలయం బీసీ అభ్యర్థిగా తాను అఖండ విజయం సాధిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రఘునాథరెడ్డి, రామక్రిష్టారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, భీమిరెడ్డి, నాగరాజు, రామయ్య, బొజ్జప్ప, కౌలుట్లయ్య, చాకలి రాఘవేంద్ర పాల్గొన్నారు.

హోటళ్లు తెరవరాదు

ఎమ్మిగనూరుటౌన్, జూన్2: ఈనెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా పట్టణంలో హోటళ్లు, టీస్టాళ్లు తెరవరాదని పట్టణ సీఐ మధుసూదన్ రావు తెలిపారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో పట్టణంలోని అయా ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, టీస్టాళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తుగ్గలి, జూన్ 2: అనుమానాస్పద స్థితిలో తలారి శ్రీరాములు (53) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆదివారం తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. తలారి శ్రీరాములు శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటి నుంచి పొలానికివెళ్లాడు. తెల్లవారుజామున శ్రీరాములు కుమారుడు రాము పొలానికి వెళ్లగా ఎదురుగా ఉన్న పొలంలో శ్రీరాములు మృతి చెంది ఉండటం చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. అయితే, శ్రీరాములు గ్రామంలోని ఊరు వాకిలి ముందు కట్టపై కూర్చుని ఉండగా.. అదే గ్రామానికి చెందిన కురువ హనుమంతుతో పాటు పెద్దయ్య కాళ్లతో తన్ని అవమానించారని, తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీరాములును కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లి ఓదార్చాన్నారు. శ్రీరాములు కుటుంబానికి, హనుమంతు కుటుంబానికి పాతకక్షలు ఉన్నాయని, వాటిని మనసులో పెట్టుకుని బలవంతంగా పురుగుల మందు తాపించి హత్య చేశారని మృతుడి భార్య తలారి రంగమ్మ ఫిర్యాదు చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. శ్రీరాములు అనుమానాస్పద మృతితో గ్రామం ఉలిక్కిపడింది. తుగ్గలి పోలీసులు పోస్టుమార్టం నిమ్మితం మృతదేహాన్ని పత్తికొండ వైద్యశాలకు తరలించారు.

ఆవేశాలకు లోను కావొద్దు

గోనెగండ్ల, జూన్ 2: గ్రామాల్లో జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ రోజు ప్రజలు సంయమనం పాటించాలని, ఎవ్వరు ఆవేశాలకు లోను కాకుండదని సీఐ రామకృష్ణయ్య అన్నారు. ఆదివారం గోనెగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలీసులు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. మైకులలో బహిరంగంగా ప్రకటనలు చేశారు. కౌంటింగ్ రోజు గ్రామాల్లో బణాసంచా కాల్చడం, ర్యాలీలు సభలు, సమావేశాలు నిర్వహించడం, జనం గుంపుగా ఉండటం, మద్యం సేవించి కేకలు వేయడం చేయరాదని తెలిపారు. నిబంధనలను పాటించక పోతే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలను వ్యతిరేకిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా పాత కట్టడాలు



ప్రధాన రహదారిలో ఉన్న పాత కట్టడం

ఆదోని టౌన్, జూన్ 2: వర్షాకాలం ప్రారంభం కానుంది. పట్టణంలోని పాత కట్టడాలు ప్రమాదకరంగా పరిణమించాయి. పాత పట్టణ పరిధిలో 50 ఏళ్ల పైబడి నిర్మించిన పాత మట్టి మిద్దెలు వర్షాలకు కూలిపోతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని నిర్మాణాలు కోర్టు వివాదాలలో ఉండడంతో అవి మరమ్మత్తులకు నోచుకోకుండా ప్రమాద స్థాయిలోకి చేరుకోవడంతో స్థానికులు, అటు వైపుకు రావడానికి భయపడుతున్నారు. గతంలో మేతర్ మసీదు వెనుక ఉండే ప్రాంతంలో ఒక పాత నిర్మాణం కూలిపోయి, అటువైపు వెళ్తున్న ఒక వ్యక్తి చనిపోయాడు.

గత ఏడాది వర్షాకాలంలో పట్టణ పొలిమేరలో ఉన్న మైనారిటీ కాలనీలోని ప్రభుత్వ పట్టాలలో నిర్మించిన కాలనీలోని ఒక ఇంటి పైకప్పు కూలి ఒక మహిళ మరణించింది. మరొక ఇంటిపై కప్పు కూలిన సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రతి ఏడాది వర్షాలు అధికంగా ఉంటున్న సమయంలో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలు కూలిపోయి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణాలకు సంబంధించిన వారిని అప్రమత్తం చేసి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

● **అప్రమత్తం చేస్తున్నాం**

పాత కట్టడాలలోని నివాసితులు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తం చేస్తున్నాం. సచివాలయ సిబ్బందితో పాత కట్టడాలను గుర్తించి, వారికి సూచనలు అందిస్తున్నాం.

- శ్రీనివాసులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్

కరెంటు బిల్లు షాక్

● చాకలి బసమ్మకు రూ.2,180 విద్యుత్ బిల్లు
● కరెంటే వద్దంటూ బాధితుల మొర



రూ.2,180 వచ్చిన కరెంటు బిల్లును చూపుతున్న చాకలి బసమ్మ

కోసిగి, జూన్ 2: ఓ నాలుగు ఇళ్లల్లో పని చేస్తూ బట్టలు ఉతికి జీవనం సాగిస్తున్న పేదరాలు చాకలి బసమ్మ, తన కూతురు చాకలి ఎల్లమ్మతో కలిసి జీవిస్తున్నారు. కూతురుకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఉన్న చిన్న పెంకుటింటిలో ఒక బల్బు, ఒక ఫ్యాన్ మాత్రమే వినియోగిస్తున్నారు. గతంలో ఇంటి కరెంటు బిల్లు రూ.100 వచ్చేది. అయితే, ఏప్రిల్ నెలకు సంబంధించి సర్వీసు నెంబర్.8612118005329 నెంబరుకు కరెంటు బిల్లు రూ.2,180 వచ్చిందని బాధితురాలు వాపోయిది. 65 ఏళ్ల వయస్సులో పది ఇళ్లల్లో వెళ్లి బట్టలు ఉతికితేగాని పూట గడవని స్థితి ఆమెది. 'కరెంటు బిల్లు రూ.2,180 వస్తే ఎలా కట్టాలి? మాకు కరెంటు వద్దు.. కరెంటు ఉంటేనే బతుకుతామా.. దీపం పెట్టుకుని ఉంటాం' అంటూ బసమ్మ ఆంధ్రజ్యోతి ఎదుట తన ఆవేదన వెలిబుచ్చారు. అసలే పనులు లేని కాలంలో రూ.2,180 కరెంటు బిల్లు కట్టుకోవడం తమ వల్ల కాదని, తమ ఇంటి కరెంటు కనెక్షన్ తొలగించాలని ఆమె కోరింది. గతంలో నెలకు రూ.100 వచ్చేదని, ఇప్పుడు ఏకంగా 20 రెట్లు దాకా కరెంటు బిల్లు రూ.2,180 పెడితే తాము ఎలా కట్టగలమని వాపోయింది.

విద్యార్థులకు వాల్మీకి ప్రతిభ పురస్కారాలు



మహర్షి వాల్మీకి ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

కోసిగి, జూన్ 2: మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి (బోయ) కమ్యూనిటీకి చెందిన విద్యార్థులకు మండల వాల్మీకి ఉద్యోగ బృందం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి పురస్కారాలను అందించారు. ఆదివారం స్థానిక చౌడేశ్వరి దేవి కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు హంశేనీ, తిమ్మారెడ్డి, లక్ష్మికాంత్, నారాయణ, బందెనహాల్ సత్య, రమేష్‌నాయుడు, సుధాకర్‌బాబు హాజరై ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలతో పాటు ఫైల్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని రిటైర్డు వాల్మీకి ఉద్యోగులు, అన్ని శాఖల్లో పని చేస్తున్న వాల్మీకి ఉద్యోగ బృందంసభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించాలి

ఆలూరు రూరల్, జూన్ 2: స్థానిక కొత్త బస్టాండ్‌లో తాగునీటి సదుపాయం కల్పించాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి షైన, ఉపాధ్యక్షుడు గోవర్ధన్ కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొత్త బస్టాండ్ వద్ద తాగునీటి, ఇతర సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, ప్రయాణికులు నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారని, ఆర్టీసీ అధికారులు తాగునీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బస్టాండ్ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ఆదోని, జూన్ 2: జీవనజ్యోతి అనాథాశ్రమంలో సహృదయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా అనాథలకు భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడారు. కడుపేదవారిని గుర్తించి, వారిని ఆదుకునే విధంగా పనిచేస్తున్నామన్నారు. ఎవరైనా పేదవారు తమ పిల్లల్ని ఉన్న చదువులు చదివించుకులేని పరిస్థితుల్లో ఉంటే, అలాంటి వారికి తమ వంతు సాయం అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహోదయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు రఘు, పెద్దయ్య, అనిల్, సునీల్ రెడ్డి, చలపతి, జావీద్, గౌడ, సోమప్ప పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిదే అధికారం

ఎమ్మిగనూరు, జూన్2: రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సారాధ్యంలోని ఎన్డీఏ కూటమే అధికారం చేపడుతుందని ఆత్మ ఎమ్మిగనూరు మండలం మాజీ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయసర్వే సంస్థలన్నీ ఎన్డీఏ కూటమికే జైకొట్టాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాలంటే చంద్రబాబు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఏది ఏమైనా ఈనెల 4న జరగబోయే ఓట్ల లెక్కింపులో ఎన్డీఏ కూటమి విజయదుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీ జెండా ఎగడం తథ్యం : ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగడం తథ్యమని టీడీపీ ఈడిగ సాధికార కమిటీ కర్నూలు పార్లమెంటు అధ్యక్షుడు శంకర్ గౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన బీవీ జయనాగేశ్వరరెడ్డిని ఎన్నికల్లో ప్రజలు ఆదరించారని పేర్కొన్నారు. ప్రజలు సీఎం జగన్ పీకనొక్కి రాష్ట్రాన్ని కాపాడుకుంటారని తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

గోనెగండ్ల, జూన్ 2: ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల వ్యాపారులు రైతులకు ఎరువులు, విత్తనాలు, ఎంఆర్‌పీ ధరలకు కాకుండా అధికధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత హెచ్చరించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎరువుల వ్యాపారులు మందు నిల్వలను, ధరలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని, స్టాక్ రిజిష్టర్, బిల్లుబుక్ లను ధ్రువీకరించాలని కోరారు. విత్తనాలకు సంబంధించిన సర్టిఫికేట్ ఆఫ్‌సోర్స్ ఇతర వివరాలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. రైతులకు కొనుగోలు చేసిన వెంటనే వ్యాపారులు రసీదు తప్పని సరిగా ఇవ్వాలని కోరారు. పంట కాలం పూర్తి అయ్యేవరకు రసీదు ను భద్రంగా రైతులు దాచుకోవాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం - వ్యక్తి అరెస్టు



మంత్రాలయంలో పట్టుబడిన కర్ణాటక మద్యంతో పోలీసులు

మంత్రాలయం, జూన్ 2 : మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కట్టుబడి ఖాదర్ అనే వ్యక్తి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తెస్తుండగా మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ పట్టుకున్నారు. ఆదివారం గ్రామ శివారు భీరప్ప గుడి వద్ద వాగు దాటుతుండగా 4 బాక్సులోని 384 కర్నాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టుచేశారు. నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.